వైఎస్సార్‌ సీపీ శ్రేణుల్లో జోష్‌



సామాజిక సాధికార బస్సు యాత్రతో జోష్‌గా కనిపిస్తున్న వైఎస్సార్‌ సీపీ శ్రేణులు

- సాధికార సభ విజయవంతం
- వేలాదిగా హాజరైన జనం
- అందరికీ ధన్యవాదాలు చెప్పిన కన్నబాబు
- విఫలమైనట్టు చూపేందుకు పచ్చ పత్రిక తాపత్రయం

కాకినాడ రూరల్‌: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నాలుగున్నరేళ్లుగా పొందిన లబ్ధితో ఎంతో సంతోషంగా ఉన్న రాష్ట్రంలోని ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలు ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ రావాలని కోరుకుంటున్నారు. వారంతా సాధికారత సాధించేలా వారికి అందించిన ముఖ్యమైన పదవులు, సంక్షేమ పథకాలను తెలియజేసేందుకు బస్సు యాత్రలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో తొలిసారిగా నియోజవర్గంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో సర్పవరం జంక్షన్‌లో సోమవారం సాయంత్రం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభ విజయవంతమై వైఎస్సార్‌ సీపీ శ్రేణుల్లో జోష్‌ నింపింది. నియోజకవర్గంలో కాకినాడ రూరల్‌, కరప మండలాలతో పాటు అర్బన్‌లో రూరల్‌ డివిజన్ల నుంచి, జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహిళలు తండోపతండాలుగా పోటెత్తారు. నాలుగు రోడ్లు కూడలిగా ఉన్న సర్పవరం జంక్షన్‌ నేల ఈనిందా అన్నట్టు సుమారు 15వేల మందికి పైగా జనాలు తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచి వేచి ఉన్న జనాల్లో కొందరు సభ చివరిలో చీకటి వల్ల వెనుదిరగగా.. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం, పార్టీ పరంగా చేపట్టే కార్యక్రమాలను తక్కువ చేసి చూపాలని కాచుకుని కూర్చున్న ఎల్లో మీడియా ఈ సభపై విషం కక్కింది. సభలో మంత్రులు మాట్లాడుతుండగా జనాలు మళ్ళీ పోయినట్టు, ఖాళీ కూర్చీలు ఉన్నట్టుగా, ట్రాఫిక్‌ ఆంక్షలతో పబ్లిక్‌ ఇబ్బంది పడినట్టు కథనాలు వడ్డించింది. ఈ రాతలపై వైఎస్సార్‌ సీపీ శ్రేణులు పెదవి విరిచారు. బాగా రాస్తే ఆనందపడాలి కానీ.. విజయవంతమైన సభను తక్కువగా చూపేందుకు అబద్దాలు రాస్తే కొత్తేముందని పలువురు నేతలు పేర్కొన్నారు. కురసాల సారథ్యంలో సభ విజయవంతమైందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చారని, ఇది తమకు ఉత్సాహాన్ని నింపిందని, రానున్న ఎన్నికల కోసం ఇప్పటి నుంచి ప్రణాళిక ప్రకారం పనిచేస్తామని వైఎస్సార్‌ సీపీ మండల జేసీఎస్‌ కన్వీనర్‌, గంగనాపల్లికి చెందిన గీసాల శ్రీనివాసరావు తెలిజేశారు. మరో వైపు బస్సు యాత్ర విజయవంతం కోసం నియోజవర్గ నలుమూలల నుంచి ర్యాలీగా వాహనాలలో తరలివచ్చిన వారందరికీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరికీ రుణ పడి ఉంటానని, సీఎం జగన్‌, తనకు రానున్న ఎన్నికల్లో మరో చాన్స్‌ ఇచ్చేందుకు కష్టించి పనిచేయాలని ఆయన కోరారు.



ఎల్లో మీడియా రాతలకు ఈ చిత్రమే సమాధానం... సర్పవరం జంక్షన్‌లో ఉప్పొంగిన జన సంద్రం

అప్రమత్తంగా బాణసంచా విక్రయాలు

- ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవు
- కాకినాడ ఆర్డీవో కిషోర్‌

కాకినాడ సిటీ: దీపావళి పండగ నేపథ్యంలో భద్రత అంశంపై రెవెన్యూ, పోలీస్‌, అగ్నిమాపక, కార్మిక శాఖల అధికారులతో ఆర్డీవో ఈట్ల కిశోర్‌ తమ కార్యాలయంలో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీపావళి బాణసంచా తయారీదారులు, విక్రయదారులు సురక్షితమైన వాతావరణంలో పండుగ చేసుకునేందుకు అన్ని ప్రామాణిక భద్రతా చర్యలను పాటించాలని, అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల్లో వృద్ధులు, మహిళలు, బాలలతో పని చేయించకూడదని, శిక్షణ పొందిన కార్మికులను మాత్రమే నియమించుకోవాలని ఆర్డీవో తెలిపారు. ఎటువంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని ఆదేశిస్తూ ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరాలు విధిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బాణసంచా విక్రయాలను అనుమతించిన ప్రదేశాల్లో నిర్దేశించిన సమయంలో మాత్రమే జరుపుకోవాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్‌, పోలీస్‌ అధికారులు విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టాలని, నిబంధనలను అతిక్రమించి బాణసంచా తయారీ, విక్రయాలకు పాల్పడితే చర్యలు చేపట్టాలని ఆర్డీవో ఆదేశించారు. సమావేశంలో డీఎస్పీ పడాల వెంకట మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ తయారీ విక్రయ కేంద్రాల్లో నిర్దేశించిన పరిమాణంలో మాత్రమే బాణాసంచా నిల్వలు ఉండాలన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారి సమాచారం ఉంటే వెంటనే పోలీస్‌, రెవెన్యూ సిబ్బందికి తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ సమావేశంలో అగ్నిమాపక అధికారి డీవీ సుబ్బారావు, కాకినాడ డివిజన్‌ తహసీల్దార్లు, పోలీస్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్లు, బాణసంచా తయారీదారులు, విక్రేతలు పాల్గొన్నారు.



బాణసంచా తయారీదారులు, విక్రేతలు, వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిశోర్‌



వేళంగి నానాజీ ఫైర్‌వర్క్స్‌లో పరిమితికి మించి ఉన్న మందుగుండు సామగ్రితో అధికారులు

పరిమితికి మించి ఉన్న మందుగుండు స్వాధీనం

కరప: బాణసంచా తయారీలో కానీ, విక్రయాల్లో కానీ నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్‌శాఖల సంయుక్త తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన తహసీల్దార్‌ పి.శ్రీనివాసరావు, జిల్లా అసిస్టెంట్‌ ఫైర్‌ ఆఫీసర్‌ ఏసుబాబు, రూరల్‌ సీఐ కె.శ్రీనివాస్‌ ఇతర సిబ్బందితో కలసి కరప మండలం నడకుదురు, వేళంగి గ్రామాల్లో పర్యటించి బాణసంచా తయారీకేంద్రాలను తనిఖీచేశారు. వేళంగిలో నానాజీ ఫైర్‌వర్క్స్‌ కేంద్రం వద్ద అనుమతికి మించి మందుగుండు సామాగ్రి ఉన్నట్టు గుర్తించి, మధ్యవర్తుల సమక్షంలో సామగ్రిని సీజ్‌ చేసి కేసు నమోదు చేశారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ లైసెన్స్‌లో ఉన్న డోర్‌ నంబరులోనే బాణసంచా తయారుచేయాలని, నిర్దేశించిన పరిమితిలోనే నిల్వలు ఉండాలన్నారు. కేంద్రం వద్ద ఇసుక, నీరు, మంటలార్పే యంత్రపరికరం ఉంచాలన్నారు. తహసీల్దార్‌ పి.శ్రీనివాసరావు, రూరల్‌ సీఐ కె.శ్రీనివాస్‌, కరప ఎస్‌ఐ ఎన్‌.రామకృష్ణ, కరప విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ ఏఈ సానా ఈశ్వరప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువును ప్రోత్సహించండి



విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్‌ కృతికా శుక్లా


కాకినాడ సిటీ: విద్యా నైపుణ్యాలు పెంపొందించేలా పది, ఇంటర్‌ ఉత్తీర్ణులు కాని విద్యార్థులతో పబ్లిక్‌ పరీక్షలు రాయించేలా, నైపుణ్య శిక్షణ కేంద్రాల్లో చేర్పేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పాఠశాల విద్యాశాఖ, నైపుణ్య శిక్షణ, ఇంటర్మీడియట్‌ అధికారులతో మిషన్‌ జీఈఆర్‌లో భాగంగా ఐదు నుంచి 18 ఏళ్ల లోపు విద్యార్థులన చేర్పాలన్నారు. జిల్లాలో 2021–23 విద్యా సంవత్సరాల్లో 5,238 మంది విద్యార్థులు పదో తరగతి తప్పారని, వీరిలో ఇప్పటి వరకు 4,489 మందితో తిరిగి పరీక్ష ఫీజులు కట్టించామన్నారు. పాఠశాలలో హెచ్‌ఎం, ఎంఈవోలు మిగిలిన విద్యార్థులకు అవగాహన కల్పించి ఈ నెల 10వ తేదీ లోపు పరీక్ష ఫీజులు చెల్లించేలా చూడాలని కలెక్టర్‌ స్పష్టం చేశారు. జిల్లాలో ఏడు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఉన్నాయని, ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా శిక్షణ ఇప్పించాలని కలెక్టర్‌ కృతికా శుక్లా తెలిపారు. సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ, డీఈవో జి.నాగమణి, ఇంటర్మీడియట్‌ ఆర్‌ఐవో నరసింహారావు, నైపుణ్య శిక్షణ అధికారి డి.హరిశేషు, డిప్యూటీ డీఈవోలు డి సుభద్ర, డానియేల్‌ రాజ్‌, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా జేవీవీ కార్యక్రమాలు

కాకినాడ సిటీ: రానున్న మూడు నెలల కాలంలో జన విజ్ఞాన వేదిక అనేక కార్యక్రమాలను చేపడుతోందని వేదిక రాష్ట్ర కార్యదర్శి కేఎంఎంఆర్‌ ప్రసాద్‌ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక యూటీఎఫ్‌ కార్యాలయంలో వేదిక చేపట్టే కార్యక్రమాల పోస్టర్‌ ఆవిష్కరణలో మాట్లాడారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు పాదయాత్రలు, ఎగ్జిబిషన్లు, స్టడీ సర్కిల్స్‌, సభలు, సమావేశాలు, చర్చా వేదికలు, వర్క్‌ షాపులు, మ్యాజిక్‌ ప్రదర్శనలు, కళాయాత్రల ద్వారా శాస్త్రీయ అంశాలను ప్రజల్లోకి తీసుకువెళ్లనున్నట్లు వివరించారు. జాతీయ సైన్స్‌ డే ఫిబ్రవరి 28న విజయవాడలో జరిగే వైజ్ఞానిక సాంస్కృతికోత్సవంతో ఈ ప్రచారోద్యమం ఒక ముగింపునకు వస్తుందన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వి.శ్రీరామారావు, అన్నా రాము, ఐ.ప్రసాదరావు, రాజబాబు, సత్యనారాయణ, శ్రీరామ్‌ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉద్యోగావకాశాలు

కాకినాడ రూరల్‌: విద్యావంతులైన యువత ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన నైపుణ్యం పెంచుకోవాలని సీవైఎఫ్‌ ఇంటర్నేషనల్‌ డైరెక్టర్‌ మూర్తిరాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద వీజేఎస్‌ ఎంఆర్‌ ఓడిగోస్‌ టెక్నాలజీస్‌ కార్యాలయం వద్ద మేనేజింగ్‌ పార్టనర్‌ వార వినోద్‌ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో మూర్తిరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అత్యంత నాణ్యత ప్రమాణాలు కలిగిన రీజనల్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ట్రైనింగ్‌ సెంటరుగా వీజేఎస్‌ ఎంఆర్‌ ఓడిగోస్‌కు గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. కాకినాడ, పరిసర ప్రాంతాల యువతకు సాఫ్ట్‌వేర్‌ తదితర రంగాలలో ఉద్యోగాలు వచ్చేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. వినోద్‌ మాట్లాడుతూ యువతకు విలువతో కూడిన సాఫ్ట్‌వేర్‌ కోర్సులలో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. తమ సంస్థకు రీజనల్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ట్రైనింగ్‌ సర్టిఫికేట్‌ రావడంతో శిక్షణ పొందేవారికి మంచి సంస్థలో ఉద్యోగాలు పొందేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో మేరీ జ్యోతి, ఉషారాణి, నాని శిరీష, కుమార్‌, మాలిక, వర్ష, విజయ్‌, తదితరులు పాల్గొన్నారు.



రీజనల్‌ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ సర్టిఫికెట్‌ను వినోద్‌కు అందజేస్తున్న మూర్తిరాజు

పథకాల లబ్ధిని ప్రజలకు వివరించండి

- ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలి
- కమిషనర్‌ నాగనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్‌ నాగనరసింహారావు

కాకినాడ: గడచిన నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన లబ్ధిని ప్రజలకు తెలియజెప్పేందుకు గురువారం నుంచి విస్తృత ప్రచారం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్‌ సీహెచ్‌ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్‌ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఈ అంశంపై ప్రత్యేకాధికారులు, వివిధ విభాగాధిపతులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతి సచివాలయ పరిధిలో పథకాల లబ్ధికి సంబంధించి సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. అమ్మ ఒడి, చేయూత, ఆరోగ్య ఆసరా, వాహన మిత్ర సహా 33 పథకాలకు సంబంధించి సచివాలయ పరిధిలో లబ్ధిదారుల సంఖ్య, అందుకున్న ఆర్థిక లబ్ధిని బోర్డులపై ప్రదర్శించాలన్నారు. లబ్ధిదారులను ఆహ్వానించి సమావేశాలు ఏర్పాటు చేసి వివరించాలని సూచించారు. గురువారం నుంచి 23వ తేదీ వరకు తొలి విడత షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని, నిర్దేశించిన తేదీల్లో రోజుకు నాలుగు వార్డులలో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వివక్షకు తావులేకుండా అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలన్నారు. అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే అందుకు కారణాలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ప్రత్యేక సమావేశాలకు రెండు రోజుల ముందుగా వలంటీర్లకు ఈ విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రభుత్వం నోడల్‌ అధికారులను కూడా నియమించిందన్నారు. సమావేశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన ఇంజినీరింగ్‌ అధికారులకు సూచించారు. తొలి రోజైన 9వ తేదీన 9ఎ, 18బి, 27ఎ, 45ఎ సచివాలయాల్లో సంక్షేమ బోర్డుల ప్రదర్శన, సభలు జరుగుతాయన్నారు. ఆయా సభలకు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించి నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించిన అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్‌ కోన శ్రీనివాస్‌, మేనేజర్‌ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్‌, ఈఈలు పి.వెంకటరావు, మాధవి, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్‌ తదితరులు పాల్గొన్నారు.


ఓటుకు అర్హతే ప్రాతిపదిక

కాకినాడ: ఎన్నికల కమిషన్‌ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తామని నియోజకవర్గ ఈఆర్‌ఓ, కమిషనర్‌ సీహెచ్‌ నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024 లో భాగంగా వచ్చిన దరఖాస్తులు, పరిష్కారాలను హాజరైన నాయకులకు వివరించారు. ఈ నెల 4, 5 తేదీల్లో జరిగిన ఓటరు నమోదు ప్రత్యేక శిబిరంలో ఫారం 6,7,8 ద్వారా కొత్త ఓట్ల నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపులకు 1881 దరఖాస్తులు వచ్చాయన్నారు. గతంలో సుమారు 80 వేల దరఖాస్తులు రాగా 56 వేల దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామన్నారు. ప్రత్యేక శిబిరాల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణంగా పరిశీలించిపరిష్కరిస్తామన్నారు. జనవరి 5వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రచురితమయ్యాక కూడా ఎన్నికల నోటిఫికేషన్‌ వచ్చే వరకు నూతన దరఖాస్తులను స్వీకరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్‌ సీపీ), తుమ్మల రమేష్‌ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), అచ్యుతరామరాజు (ఆమ్‌ ఆద్మీ పార్టీ), డిప్యూటీ కమిషనర్‌ కోన శ్రీనివాస్‌, ఏఈఆర్వోలు సీతాపతి, మురళీకృష్ణ, హరిదాసు, నాగశాస్త్రులు, జాన్‌బాబు, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను సంరక్షించుకోవాలి

- మెప్మా పీడీ ప్రియంవద
- కాకినాడలో జలదివాళి ర్యాలీ

కాకినాడ: నీటి వనరులను సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మెప్మా పీడీ బి.ప్రియంవద పేర్కొన్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మెప్మా, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జల దివాళి (నీటి దివస్‌) నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల నుంచి ఎంపిక చేసిన 50 మంది అమృత్‌ మిత్రలతో స్థానిక వాటర్‌ వర్క్స్‌ ఆవరణలో తాగునీటి వనరులను సంరక్షించుకోవలసిన ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫిల్టర్‌ బెడ్‌ను సందర్శించి నీటిని శుద్ధి చేసే విధానాన్ని వివరించారు. పీడీ మాట్లాడుతూ నీటిని వృథాగా డ్రైనేజీలలో వదలడం, రీసైక్లింగ్‌ లేకపోవడం వంటి అనేక కారణాల వల్ల నీటి నిల్వలు, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయన్నారు. ప్రతి మహిళ నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. అమృత్‌ మిత్రలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు కూడా సమావేశాలు ఏర్పాటు చేసి నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు మాట్లాడుతూ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి అందిస్తున్న శుద్ధి చేసిన నీటిని వృధా చేయకుండా కాపాడుకోవాలన్నారు. టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్‌ మాట్లాడుతూ నీటి వనరులను కాపాడుకో లేకపోతే జరిగే అనర్థాలను ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వివరించాలన్నారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణను తెలియజేసేలా గ్లాసు, వాటర్‌ బాటిళ్లతో కూడిన కిట్లను అమృత్‌ మిత్రలకు పంపిణీ చేశారు. అమృత్‌ డీఈ శ్రీనివాస్‌, మెప్మా మిషన్‌ మేనేజర్‌ డేగల వెంకట్రాజు, సీఓలు అమృత్‌ మిత్రాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న మెప్మా పీడీ ప్రియంవద, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు

క్లుప్తంగా

నేడు వినాయకుని కల్యాణోత్సవం

బోట్‌క్లబ్‌: కాణిపాక వరసిద్ధి వినాయకుని ఆలయం ఉత్సవ విగ్రహాలు, ఆలయ పురోహితులతో బుధవారం ఉదయం 8 గంటలకు కాకినాడ బాలాత్రిపుర సుందరి ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాణిపాకం ఆలయ కమిటీ చైర్మన్‌ అగరం మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త కంతేటి కాశీ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

వెంకటరమణకు పీహెచ్‌డీ



బాలాజీచెరువు: ప్రైవేట్‌ ఇంజినీరింగ్‌ కళాశాల అధ్యాపకుడు పి.వెంకటరమణకు మంగళవారం జేఎన్‌టీయూకే డాక్టరేట్‌ ప్రకటించింది. ఎక్స్‌పెరిమెంటల్‌ స్టడీస్‌ ఆన్‌ పల్సేటింగ్‌ హీట్‌ పైప్‌ అండర్‌ ద ఇన్‌ఫ్లూయన్స్‌ ఆఫ్‌ డిఫరెంట్‌ ప్రాసెస్‌ వెరియబుల్స్‌ అంశంపై ఆయన సిద్ధాంత వ్యాసం రచించారు. వ్యాసాన్ని జేఎన్‌టీయూకే డైరెక్టర్‌ ఆఫ్‌ ఎవాల్యుయేషన్‌ మెకానికల్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ బి.బాలకృష్ణ, మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి కళాశాల మెకానికల్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ పి.వి జయకుమార్‌ పర్యవేక్షణలో సమర్పించారు.

ఆ దేశాల మధ్య ఉన్నది జాతి సమస్య

కాకినాడ సిటీ: పాలస్తీనా, ఇజ్రాయిల్‌ సమస్య మత సమస్య కాదని, అదొక జాతుల మధ్య సమస్యగా చూడాలని ఎమ్మెల్సీ కేఎస్‌ లక్ష్మణరావు అన్నారు. కాకినాడలోని టీచర్స్‌ హోంలో ప్రపంచ శాంతి సమాఖ్య ఆధ్వర్యంలో పాలస్తీనా, ఇజ్రాయిల్‌ యుద్ధ పూర్వపరాలు అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమస్యపై 75 ఏళ్లుగా లేని ఒక కొత్త మత వాదనను ముందుకు తేవడం దుర్మార్గమనని అదీ దేశ పాలకుల నుండే సాగడం మరింత అన్యాయమన్నారు. ప్రపంచ చరిత్రలో మతాలు ఎప్పుడూ ఐక్యంగా లేవని, ఒక మతంలోనే అనేక యుద్ధాలు సాగాయని, ఒకే మతానికి చెందిన ఇరాన్‌, ఇరాక్‌ దేశాలు పదేళ్లపాటు యుద్ధం చేసుకుని తమ దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసుకొని అమెరికా కంపెనీలకి లాభాలు చేకూర్చయన్నారు. సమావేశానికి సమాఖ్య నాయకుడు దూసర్లపూడి రమణరాజు అధ్యక్షత వహించగా వివిధ సంఘాల ప్రతినిధులు కట్టా కృష్ణారావు, పి.దుర్గారమేష్‌, పి.వరప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు అవినాష్‌

సామర్లకోట: రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు స్థానిక ప్రగతి జూనియర్‌ కళాశాల విద్యార్థి సింగంపల్లి అవినాష్‌ ఎంపికయ్యాడు. ఆ విద్యా సంస్థల చైర్మన్‌ ఎస్‌.పూర్ణచంద్రరావు మంగళవారం అతడిని అభినందించారు. కళాశాల ఏఓ సీహెచ్‌ఆర్‌ సత్యనారాయణ మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో ఇటీవల నిడదవోలులో జరిగిన జిల్లా స్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో అవినాష్‌ రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు. అండర్‌ 19 విభాగంలో బెంగళూరులో జరుగనున్న నేషనల్‌ గేమ్స్‌ రాష్ట్ర కబడ్డీ జట్టు తరపున అతడు పాల్గొంటాడని తెలిపారు.

నేడు కార్తిక మాసోత్సవాల సన్నాహక సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కార్తిక మాసోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు బుధవారం భక్తులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవాలపై భక్తుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవడానికి ఉదయం 10 గంటలకు ఆలయంలో సమావేశం జరుగుతుందన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘం నాయకులు, దీపారాధన సంఘ సభ్యులు హాజరు కావాలన్నారు.

మరిడమ్మకు మఖ నక్షత్ర పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మరిడమ్మ అమ్మవారికి మంగళవారం మఖ నక్షత్ర పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్‌ కమిషనర్‌ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సనాతన ధర్మ ప్రచారం

పెద్దాపురం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సనాతన ధర్మ ప్రచార ప్రచార వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మరిడమ్మ ఆలయ ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో మండలంలోని ఆర్‌బీ కొత్తూరు, వడ్లమూరు గ్రామాల్లో మేళతాళాలు, భజన బృందాలతో గరగల నృత్యాలతో ఆయా గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం మరిడమ్మ ఆలయంలో ఆలయాల విశిష్టత, చరిత్ర హిందూ ధర్మంపై అవగాహన కల్పించారు. దేవస్థానం వేద పండితులు, అర్చక స్వాములతో వేదపారాయణం, సామూహిక కుంకమ పూజలు, విష్ణు సహస్రనామార్చన, లలితా పారాయణం నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వెబ్‌ ఆప్షన్‌కు నేటితో గడువు పూర్తి

కాకినాడ రూరల్‌: మండల పరిధిలో అచ్చంపేట జంక్షన్‌ వద్ద ఉన్న నన్నయ ఎంఎంఎస్‌ఎన్‌ క్యాంపస్‌లో పీజీ చదవాలనుకునే విద్యార్థులకు కౌన్సెలింగ్‌ కోసం ఏపీ పీజీ సెట్‌ వెబ్‌ ఆప్షన్లకు బుధవారం వరకు గడువు ఉందని ప్రిన్సిపాల్‌ ప్రొఫెసరు ఎస్‌.ప్రశాంతి శ్రీ తెలియజేశారు. తమ క్యాంపస్‌లో ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ పొలిటికల్‌ సైన్స్‌ అండ్‌ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌, ఎంఏ ఎకనామిక్స్‌, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌, ఎంకామ్‌, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సులు ఉన్నాయన్నారు. క్యాంపస్‌ కోడ్‌ ఏకేఎన్‌కే ఎంఎస్‌ఎన్‌ క్యాంపస్‌, ఏపీ ఐసెట్‌ కోడ్‌ ఏకేఎన్‌కే ఎంఎస్‌ఎన్‌ క్యాంపస్‌ ద్వారా నమోదు చేసుకోవాలని ఆమె మంగళవారం సూచించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

బోట్‌క్లబ్‌: స్థానిక రామారావుపేట నారాయణ ఈ టెక్నో స్కూల్‌లో మంగళవారం లయన్స్‌ క్లబ్‌ స్టార్స్‌ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దంత వైద్యులు రవి, గాయత్రి విద్యార్థులకు దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్లబ్‌ అధ్యక్షుడు నమఃశివాయ, కార్యదర్శి నాయుడు, సభ్యులు ఇంద్రగంటి నాగేశ్వరి, షర్మిల, వీఎస్‌ఆర్‌ మూర్తి, వి.నాగిని పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

కాకినాడ క్రైం: క్యాన్సర్‌పై అవగాహన పెరిగి భయం పోవాలని జీజీహెచ్‌ ఆంకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్‌ వాసన్‌ అన్నారు. జాతీయ క్యాన్సర్‌ అవగాహన దినోత్సవం సందర్భంగా మంగళవారం జీజీహెచ్‌లో రోగులు, వారి బంధువులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆంకాలజీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ప్రదీప్‌ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసన్‌ క్యాన్సర్‌ వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. జీజీహెచ్‌లో క్యాన్సర్‌కు పూర్తిస్థాయి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్పొరేట్‌ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థిక బలహీనతల వైపు అడుగువేయవద్దని సూచించారు. నిష్ణాతులైన ఆంకాలజీ నిపుణులు క్యాన్సర్‌ సేవల్లో ఆరితేరిన నర్సింగ్‌ సిబ్బంది జీజీహెచ్‌లో 24 గంటలూ సేవలందిస్తున్నారన్నారు. ఆంకాలజీ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ నరసింహ, నర్సింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ

బోట్‌క్లబ్‌: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ఈ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని ఇండియన్‌ డెంటల్‌ అసోసియేషన్‌ మాజీ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక బోట్‌క్లబ్‌లో మంగళవారం బోట్‌క్లబ్‌ వాకర్స్‌ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్‌ అవగాహన దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్‌, రాజా, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.